

# ఓ తిట్టు కథ

వసుంధర

తండ్రి పేరు దశరథ రామయ్య.

కొడుకు పేరు కోదండ రామం.

పేర్లలో ఉన్న ఆదర్శం వారికచ్చి రాలేదు.

దశరథుడు కొడుక్కి పట్టాభిషేకం చేయాలనుకుంటే భార్య సాగనివ్వలేదు. ఇష్టం లేక పోయినా ఆయన కొడుకును వనవాసానికి పంపాడు.

మన దశరథరామయ్య కొడుకును వనవాసానికి పంపలేదు. సరిగదా తనకున్నదంతా అతడి కోసమే వెచ్చించి ఆపైన అప్పుల పాలుకూడా అయ్యాడు.

కోదండరామం బాగా పైకి వచ్చాడు. కానీ తండ్రికున్న అప్పులకు భయపడి ఆయనకు దూరంగా వెళ్ళిపోయాడు. అతడి పొజిషన్ చూసి మంచి సంబంధం వచ్చింది. భార్య వచ్చేక తండ్రిని కూడా తీసుకుని వెడదామా అనుకున్నాడతను. కానీ తండ్రితో పాటు తగులుకునే అప్పు గురించి భయపడ్డాడు. ఆ అప్పులు తీర్చగల శక్తి అతడికుంది. అందుకే అతడికి మరింత భయం!

దశరథరామయ్య ఉన్న ఊళ్ళోనే ఓ వృద్ధుడింట్లో పనికి కుదిరాడు. ఆ వృద్ధుడికి నా అన్నవాళ్ళెవరూ లేరు. కొద్దిగా భూమి, స్వంతిల్లు ఉన్నాయి. ఎవరైనా చేరదీస్తే ఆస్తి కోసం తననేమైనా చేస్తారని ఆయన భయం. దశరథరామయ్యకంటె ఆయన పదేళ్ళు పెద్దవాడు. చిన్నప్పట్నించీ ఆయనకు దశరథరామయ్య బాగా తెలుసు. దశరథరామయ్యకు భార్య పోయినప్పుడు, కొడుకాయన్ను వదిలి వెళ్ళినప్పుడూ వృద్ధుడే ఆయన్ను ఓదార్చాడు.

"నేను నీ అప్పులు తీర్చి ఋణవిముక్తుణ్ణి చేస్తాను నిన్ను. నువ్వు నన్ను జీవింతాతం కనిపెట్టుకుని ఉండాలి" అన్నాడు వృద్ధుడు.

దశరథరామయ్య సంతోషంగా అందుకంగీకరించాడు.

వృద్ధుడి ఆరోగ్యం అంతంత మాత్రంగా వుంది. ఆయనకు అనుక్షణం తన్నంటి పెట్టుకునే మనిషి కావాలి. దశరథరామయ్యకూ వయసు తక్కువ కాదు. అయినా వృద్ధుణ్ణి సేవించుకుంటూ ఆయన శక్తికి మించి శ్రమపడ్డాడు.

కొన్నాళ్ళకు దశరథరామయ్యకు తీవ్రంగా జబ్బు చేసింది. వృద్ధుడు కోదండ రామానికుత్తరం రాస్తే అతడు వచ్చి పరిస్థితి విచారించాడు.

వృద్ధుడో క్రమపద్ధతిలో దశరథరామయ్య అప్పులు తీరుస్తున్నాడు. తీర్చాల్సిన దింకా మూడు వేల రూపాయలదాకా ఉంది. ఇప్పుడు వైద్యానికి అదనంగా మరో రెండు వేలు ఖర్చవుతుంది.

"నాకు నీ తండ్రి అవసరముంది. కాబట్టి ఆయనకు నేను వైద్యం చేయించుకుంటాను. నువ్వాయన్ను తీసుకుని వెళ్ళాలనుకుంటే ఆయన తరఫున నేను తీర్చిన అప్పు నాలుగు వేలూ, అదికాక ఇంకా తీర్చాల్సిన మూడు వేలూ నాకిచ్చుకోవాలి. ఆయనకు కొడుకు దగ్గరుండాలనుంది కాబట్టి నేనాయన్ను వదులుకుని మరో మనిషిని వెతుక్కుంటున్నాను" అన్నాడు వృద్ధుడు.

కోదండ రామం తండ్రిని సంప్రదించాడు.

"నన్ను నీతో తీసుకుని పో" అని ఏడ్చాడు దశరథరామయ్య.

"వద్దునాన్నా! నీకిక్కడే బాగుంటుంది" అని వెళ్ళి పోయాడు కోదండరామం.

దశరథరామయ్యకు మంచి వైద్యం జరిగింది. ఆయనిప్పుడు పూర్వం కంటె ఆరోగ్యంగా ఉండి వృద్ధుణ్ణి మరింత భక్తి శ్రద్ధలతో సేవించుకుంటున్నాడు.

ఒక రోజున వృద్ధుడు చనిపోయాడు. ఆయన వ్రాసిన విల్లు ప్రకారం యావదాస్తీ దశరథరామయ్యదే!

ఆ ఊరిని పట్నంతో కలుపుతూరోడ్డు పడింది. గోదావరి నుంచి కొత్తగా తవ్విన కాలువ ఆ ఊరిపక్క నుంచే వెడుతోంది. దాంతో దశరథరామయ్య యిల్లు, పొలం విలువ బాగా పెరిగి పోయాయి.

ఆ సమయానికి కోదండ రామం భార్యా బిడ్డలతో సహా తండ్రిని చూడ్డానికి వచ్చి కొన్నాళ్ళున్నాడు. తండ్రి వాడిని ఆదరించాడు. కోడలికి చీర కొన్నాడు. పిల్లలకు బహుమతులిచ్చాడు.

వెళ్ళేటప్పుడు తండ్రిని తనతో వచ్చేయమన్నాడు కోదండరామం.

దశరథరామయ్య రానన్నాడు.

"నీవు నా కన్న తండ్రివి. నీకు నాపై కోపముంటే నేను పైకి రాలేను. నీ దీవెనలే నాకు బలం" అన్నాడు కోదండరామం.

"ఏ కన్న తండ్రికీ కొడుకు మీద కోపముండదు..." అన్నాడు దశరథ రామయ్య.

"కానీ నీకు నా మీద కోపంగా ఉంది. నువ్వు నిజం చెప్పడం లేదు".

"నేను నిజమే చెబుతున్నాను. నాకు నీ మీద కోపం లేదు" అన్నాడు దశరథ రామయ్య.

"అయితే......." అని ఆగాడు కోదండరామం.

నాతో రానంటావేం అని కొడుకడిగితే ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు దశరథరామయ్య.

"అయితే నీతదనంతరం నీ ఆస్తి నాపేరున వ్రాస్తావా?" అన్నాడు కోదండరామం.

దశరథరామయ్య కొడుకు వంక అదోలా చూశాడు.

కొడుకు కళ్ళలో ఆయనకు ఆశ, స్వార్థం స్పష్టంగా కనిపించాయి.

కోదండరామం తండ్రి కళ్ళలోకి చూస్తున్నాడు. ఆయన చూపుల భావాల్నతడు చదవగలిగితే....

"నా కొడుకు" అన్నమాట అసభ్యకరమైన తిట్టు ఎలాగయిందో ఎందుకయిందో అతడికి వెంటనే అర్థం కాగలదు.